

# అపద్బాంధవ్యం

వాణిశ్రీ

సర్కిల్ ఇన్‌స్పెక్టర్ యూనిఫాంలో యముడికి తమ్ముడిలా వున్నాడు. పెద్ద పెద్ద మీసాలతో, భారీకాయంతో వున్న అతన్ని చూస్తే రాజశేఖర్ గుండె జల్లుమంది. అతను కిరణ్ తండ్రి.

స్టాఫ్ రూంలో వణుకుతూ కూర్చున్నాడు లెక్చరర్ రాజశేఖర్. బైట వాతావరణం చల్లగా వుంది. సన్నటి చినుకులు పూలజల్లులా పడుతున్నాయి. అయినా అతని ముఖం చెమటతో తడిసింది. భయంతో గుండె అదురుతోంది. చూసీ చూడనట్లుపోతే పోయేదానికి కొంపమీదికి తెచ్చుకున్నాను. రాజశేఖర్ విచారించాడు జరిగినదానికి.

ఇన్‌స్పెక్టర్ ప్రిన్సిపాల్ రూమ్‌లోకి వెళ్ళాడు.

ప్రిన్సిపాల్ ఆశ్చర్యం వ్యక్తంచేసి "ఏమిటి ఇలా వచ్చారు? మా కాలేజిలో ఏదైనా నేరం జరిగిందా?" అన్నాడు.

"అబ్బే అదేం లేదు మా అబ్బాయి కిరణ్‌ని నిన్న ఎవరో లెక్చరర్ కొట్టాడట క్లాసులో. వాడు ఇంటికి వచ్చి ఒకటే ఏడుపు. వాడిని కొట్టింది ఎవరో ఏమిటో కనుక్కునిపోదామని వచ్చాను" చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

"అలాగా! నాకు తెలీదే! ఎందుకు కొట్టాడో?" ప్రశ్నించాడు ప్రిన్సిపాల్.

"మావాడు ఎవరో ఒక అమ్మాయిని

పోర్స్ అడిగాడట. క్లాస్‌లో డిస్టర్బెన్స్ ఏమిటని కొట్టాడట. మరీ అంత దారుణం అయితే ఎలా మాస్టారూ? అంతమాత్రానికే కొట్టి క్లాస్‌లో నుంచి బైటకు పెట్టాలా?" నిష్ఠూరంగానూ, కోపంగానూ అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఇదంతా ఎవరు చెప్పారు మీకు?" ప్రశ్నించారు ప్రిన్సిపాల్.

"మా అబ్బాయే."

"తప్పుచేసినవాడు తను తప్పు చేశానని ఎప్పుడూ చెప్పడు. మీకు బాగా తెలుసు ఆ సంగతి" అన్నారు ప్రిన్సిపాల్.

"అయితే మావాడిదే తప్పంటారా?"

"కావచ్చు. ఇప్పుడే ఒక పక్షానికి రాకండి. మీవాడు చెప్పింది విన్నారు. ఆ లెక్చరర్ కూడా చెప్పింది వినండి. అప్పుడు తెలుస్తుంది తప్పెవరిదో? అంతగా కాకపోతే క్లాస్‌లో పిల్లల్ని కూడా విచారిద్దాం" అన్నారు ప్రిన్సిపాల్.

ఇన్‌స్పెక్టర్‌కి ప్రిన్సిపాల్ ధోరణి నచ్చలేదని అతని ముఖమే చెప్తోంది.

బెల్ కొట్టారు ప్రిన్సిపాల్.

అటెండర్ లోపలకు వచ్చాడు.

"ఎవరు ఆ లెక్చరర్?" ప్రిన్సిపాల్ ప్రశ్నించారు ఇన్‌స్పెక్టర్ని.

ఇన్‌స్పెక్టర్ జేబులోంచి చిన్న స్లిప్ తీసి చూసి చెప్పాడు.

"రాజశేఖర్..."

"కె.యల్. రాజశేఖర్‌గార్ని పిలుచుకురా" చెప్పారు అటెండర్‌తో.

అటెండర్ వెళ్ళిన కాసేపటికి రాజశేఖర్ వచ్చారు. ఇద్దరికీ విష్ చేసి కూర్చున్నాడు.

"మిస్టర్ రాజశేఖర్, నిన్న క్లాస్‌లో ఏం జరిగింది? ఇన్‌స్పెక్టర్‌గారి అబ్బాయిని కొట్టారట?" సీరియస్‌గా ప్రశ్నించారు ప్రిన్సిపాల్.

"నేను రీజన్ చెప్తున్నాను సార్. అప్పుడు కిరణ్ తన ముందు బెంచీలో కూర్చున్న అమ్మాయి పిలకజడ లాగాడు సార్. నేను కళ్ళారా చూశాను. కిరణ్ ఇంతకుముందు కూడా అమ్మాయిల్ని నిక్‌నేమ్స్‌తో అల్లరి పెట్టడం, అసభ్య పదజాలంతో వేధించడం కూడా గమనించాను. లెక్చరర్ ముందే అల్లరి పెడుతుంటే ఎలా సహించాలి సార్? అందుకే మందలించాను. కాని అతను నన్ను ఎదిరించాడు. కోపం వచ్చి కొట్టాను" చెప్పారు రాజశేఖర్.

ప్రిన్సిపాల్ ఇన్‌స్పెక్టర్ వైపు చూశారు.

"ఆఫ్‌కోర్స్, మావాడు మీమాట వినలేదు. ఎదిరించాడనుకుందాం. అయితే కొట్టడమేనా? ప్రిన్సిపాల్‌కి రిపోర్టు చెయ్యాలి. ఇంతకుముందు కూడా అల్లరి చెయ్యడం గమనించానన్నారు. అప్పుడు ఎందుకు గమ్మున ఊరుకున్నారు? ప్రిన్సిపాల్‌గారికి ఎందుకు చెప్పలేదు? అప్పుడే చెప్పివుంటే ప్రిన్సిపాల్‌గారు ఈ విషయాన్ని నా నోటీసుకి తీసుకువచ్చేవారు గదా?" దబాయిస్తూ అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"క్లాస్ బయట జరిగే అల్లరి గురించి నేను పట్టించుకోలేదు."

"ఏదేమైనా కొట్టడం తప్పు! కొట్టబోయేముందు ఎవరి పిల్లవాడో ఆలోచించాలి" తన హోదాను తెలియజేస్తూ అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"కాలేజీలో అటువంటి అంతరాలు పట్టించుకుంటే ఎలా సార్! ఇక్కడ అందరూ సమానమే!" ప్రిన్సిపాల్ కల్పించుకుని అన్నాడు.

"అందరూ ఒకటే ఎలా అవుతారు?" అని మొండిగా వాదించాడు ఇన్‌స్పెక్టర్

"తప్పుచేసినప్పుడు లెక్చరర్ రియాక్టు కాకపోతే ఇక ఆడపిల్లలకు భద్రత ఏం వుంటుంది సార్? కుర్రాళ్ళు మరీ రెచ్చిపోతారు తమని ఎవరూ ఏం చెయ్యరని" అన్నాడు ప్రిన్సిపాల్. తప్పుచేసిన కొడుకుని వెనకేసుకువస్తున్న ఇన్‌స్పెక్టర్ మీద అతనికి చిరాకు కలిగింది. ఇటువంటి తండ్రులు గూడా వుంటారన్నమాట అనుకున్నాడు.

"కిరణ్ నన్ను పోలీస్ కేసులో ఇరికించి జైల్లో వేయిస్తానన్నాడు సార్." చెప్పాడు రాజశేఖర్.

"ఆ పని చెయ్యడం ఎంతసేపు?" గర్వంగా అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"సారీ మిస్టర్ ఇన్‌స్పెక్టర్! మీరలా మాట్లాడకూడదు. మీ రింతకుముందు చెప్పారు చూడండి ఎవరో ఏమిటో ఆలోచించకుండా చెయ్యగూడదని. దాన్నే మీకు గుర్తుచేస్తున్నాను. ఈ రాజశేఖర్ ఎవరో, ఏమిటో తెలుసుకోకుండా మాట్లాడకండి" సీరియస్‌గా చెప్పాడు ప్రిన్సిపాల్.

ఇన్‌స్పెక్టర్‌లో కదలిక కనిపించింది స్పష్టంగా.

"ఎవరు సార్ ఇతను?" ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్.

"మీ యస్.పి. గారి మేనల్లుడు" చెప్పాడు ప్రిన్సిపాల్.

ఇన్‌స్పెక్టర్ ఎటెన్షన్‌లోకి వచ్చేశాడు. కుర్చీలోంచి అమాంతం లేచి నిలుచున్నాడు. ఎస్పీ ముందు నిలుచున్నంత కంగారు పడిపోయాడు

"మా యస్పీ దొర మేనల్లుడా?" అని ఇద్దరికీ క్షమాపణ చెప్పి తోక ముడిచాడు.

ఇన్‌స్పెక్టర్ వెళ్ళిపోయిన తర్వాత పకపక నవ్వాడు ప్రిన్సిపాల్. రాజశేఖర్ చిత్తరపోతూ చూశాడు

"ఇటువంటివాళ్ళ దగ్గర తెలివిగా ప్రవర్తించాలి రాజశేఖర్" అన్నాడు ప్రిన్సిపాల్.

"సార్! తర్వాత ఎప్పుడయినా నేను యస్పీగారి మేనల్లుణ్ణి కాదని ఈ ఇన్‌స్పెక్టర్‌కి తెలిస్తే ఎలా? ఏదొక కేసులో ఇరికించి లాకప్‌లో పడేసి వాయించేస్తాడేమో?" కంగారుగా అన్నాడు రాజశేఖర్.

"డోంట్ వర్రీ మిస్టర్ రాజశేఖర్! తెలిసినప్పుడు చూసుకుందాం. అప్పటికి ఆ యస్పీ వుంటాడా? ఈ ఇన్‌స్పెక్టర్ వుంటాడా? రాజెవరో? రెడ్డెవరో? అంతా మాయ" అన్నాడు ప్రిన్సిపాల్ నవ్వుతూ.

★